# ఎవరికెవరో?

డాక్టర్ నీరజ



పెళ్లి కూతురిని అప్పగించేశారు. పందిరి అంతా సద్దుమణిగింది. ఎక్కడివాళ్లక్కడ వెళ్లిపోయారు. వాళ్లందరికీ వీడ్కోలిచ్చి అలసిపోయినట్లుగా పందిరికి కట్టిన మామిడాకులు కాస్త వడిలివున్నాయి.

ఒకప్పుడు నన్నూ అలాగే అత్తారింటికి పంపారన్న సంగతి గుర్తుకు వచ్చింది, నవ్వూ వచ్చింది. పందిరంతా పరిశీలనగా చూస్తున్న నా దృష్టి ఎక్కడో మూల కూర్చున్న భరణి బావమీద పడింది. మొదటినుంచీ నవ్వుతూ, నవ్విస్తూ ఉండే మనస్తత్వం నాది. నా ఆత్మీయులెవరైనా బాధ పడితే నేనసలు తట్టుకోనేలేను.

బావ దగ్గరికి వెళ్లి భుజంమీద చెయ్యేసి "బావా!" అని పిలిచాను మృదువుగా, ఆత్మీయంగా.

తలెత్తిన బావ కళ్లు నిండివున్నాయి.

"ఊరుకో బావా! ఏంటిది చిన్నపిల్లాడిలా? ఆడపిల్ల అంటేనే అక్కడి పిల్ల అని కదా అర్థం! అయినా మీ అమ్మాయి ఏమైనా సముద్రాలు దాటి వెళ్లిందా? ఈ ఊరే కదా! ఎప్పుడు కావాలంటే అప్పుడెళ్లి చూడొచ్చు. దీనికంత డీలా పడిపోతావెందుకు? మొహం చూడు, ఎలా పీక్కుపోయిందో! లేచి మొహం కడుక్కో. కాస్త కాఫీ తెచ్చిస్తాను" అంటుంటే, "నీలూ!" అంటూ నా చేతులు పట్టుకుని, "నేను తప్పు చేశాను నీలూ! చాలా తప్పు చేశాను. నన్ను క్షమించు!" అని ఏడ్చేశాడు బావ.

ఎందుకో గానీ, నాకు వికటాట్టహాసం చెయ్యాలనిపించింది. అమాయకురాలినైన నా జీవితంతో ఆడుకున్న ఆ సంఘటన గుర్తు చేసుకునేందుకు మనసు గతంలోకి ప్రయాణించింది.

***

మా బాబాయి పెళ్లి మా వదిన (మామయ్యగారి అమ్మాయి) తో కుదిరిందన్న సంబరం కన్నా, నా చిన్ననాటి స్నేహితురాలూ, మరో బాబాయిగారి అమ్మాయీ అయిన మాలినిని కలుస్తున్నానన్న ఆనందమే పట్టరానిదయింది. సమవయస్కురాళ్లం కనుక ఆరవతరగతి నుంచీ ఉత్తరాలు రాసుకునేవాళ్లం. అదిప్పటివరకూ సాగుతూనే ఉంది. ఇప్పుడిద్దరం డిగ్రీ ఫైనల్ చేస్తున్నాం. అందరం కలిసి మా మామయ్యగారింటికి ప్రయాణమయ్యాం. ఆయన పెద్దమ్మాయే మా బాబాయికి ఇల్లాలు కాబోతూంది. మామయ్య మూడో కొడుకు భరణి ఈ కథకు నాయకుడు. మేమంతా పెళ్లికొడుకు తరఫు వాళ్లమయినా, నేను మామయ్యగారింట్లోనే పుట్టి పెరగటం వల్ల నాకన్నా మాలినికే ఎక్కువ గౌరవమర్యాదలూ, ప్రాముఖ్యమూ ఇచ్చారు.

మామూలుగా మొదలైన ఆ విషయం చాలా దూరం వెళుతుందని నాకప్పుడు అనుకోలేదు.

***

భరణి బావ చిన్నప్పుడు నన్నెత్తుకుని ఆడించేవాడట. అతను నన్నలా ఎత్తుకు మోస్తుంటే ఇంటివారే కాక, ఇరుగూ పొరుగూ కూడా "పెళ్లామంటే ఎంత అపురూపమో!" అని ఏడిపించేవారట. ఆ విషయం కూడా పెళ్లికి వెళ్లినప్పుడే తెలిసింది. అప్పుడప్పుడే మనసు తాలూకు సందడులు మొదలవుతున్నాయేమో, నాకు, భరణి బావకు ఎదురుపడాలంటే కాస్త బిడియంగా అనిపించేది.

మేనత్త, మేనమామ పిల్లలంటే వరస పెట్టి వేళాకోళాలాట్టం మామూలే. అదెంతో సరదాగా కూడా ఉంటుంది. పుట్టి బుద్ధెరిగాక ఎలాంటి ఎగతాళీ, వేళాకోళాలూ నాకెప్పుడూ అనుభవంలోకి రాలేదు. ఇదంతా మా బాబాయి పెళ్లి సందర్భంలోనే మొదలైంది. నిజం చెప్పొద్దూ, నాక్కూడా కాస్త సరదాగా అనిపించిన మాట ఒప్పుకుంటున్నా. అయినా సరే, ఆ సరదాను చిరుకోపం కింద కప్పిపుచ్చి నాకదంతా నచ్చనట్లుగా ప్రవర్తించేదాన్ని. కాని లోలోపల మాత్రం బాగా ఎంజాయ్ చేసేదాన్ని.

ఆ రోజుల్లో పెళ్లి అంటే కనీసం నెల రోజుల ముందు నుంచీ అయినా బంధువులు వచ్చేవారు. అలా మేమంతా కలిసి దాదాపు ఓ ముప్పైమంది పిల్లలం-రకరకాల వయస్సుల వాళ్లం -అక్కడ చేరాం. అందరం వలయాకారంగా భోజనాలకు కూర్చునేవాళ్లం. సరిగ్గా మధ్యలో ఇద్దరికి ఖాళీ ఉంచి మిగతా అందరూ ముందుగా సెటిలైపోయేవాళ్లు. భరణి బావా, నేనూ పక్కపక్కనే కూర్చోవలసి వచ్చేది. చిన్నప్పటి అలవాటు ప్రకారం నేను బావ భుజం మీదో, చేతి మీదో చెయ్యి వేసి మాట్లాడుతుంటే అందరూ గొల్లున నవ్వేవారు. వారి నవ్వులూ, వేళాకోళాలూ ఒక్కోసారి నాకు చాలా ఇబ్బందిగా అనిపించేవి. తమాషా ఏమిటంటే ఈ పిల్లల అల్లరికి పెద్దవాళ్లూ వంత పాడేవారు.

"వదినా! పప్పు కావాలి" అని నేనడిగితే నాకు స్వీటు వడ్డించేవారు. భరణిబావ స్వీటు కావాలంటే పప్పు వడ్డించేవారు. పొరపాటు వడ్డారేమో అనుకుని "ఏంటి బావా ఇది?" అని గారాలు పోయానోసారి.

"ఏమో నీలిమా! నాకు మాత్రం ఏం తెలుసు? స్వీటు పూర్తిగా తినలేకపోతే నాకివ్వు" అన్నాడు. నిజమేనేమో అనుకున్నాను. కాని ఈ కోతిబావ కూడా వాళ్లతో చేరిపోయాడని కాసేపయ్యాక అర్థమైంది. అంతే! ఉక్రోషంతో భోజనం ముందు నుంచి లేవబోతుంటే, బావ చటుక్కున నా చెయ్యి పట్టుకుని కూర్చోబెట్టి, "మధ్యలో లేవటం బావుండదు నీలూ!" అన్నాడు.

"ఏంటో బావామరదళ్లిద్దరూ గుసగుసలు పోతున్నారు. మేం కూడా వినాలి. గట్టిగా చెప్పండి" అంటూ అక్కడున్నవాళ్లలో కొందరు కోరస్‌గా అరవటం ప్రారంభించారు.

దాంతో భరణి "ఏం లేదు. మరో స్వీట్ వేస్తే ఈ సారి ఇద్దరం పంచుకుంటాం కదా అంటూంది" అన్నాడు నవ్వుతూ.


వెంఠనే ఎవ్వరూ చూడకుండా బావ భుజం మీద గట్టిగా గిల్లి వదిలిపెట్టాను. బావ కెవ్వుమని అరవటం, అంతా ఏమైందని అడగటం, ఈ సందట్లో నేను అక్కడినుంచి జారుకోవటం జరిగాయి.

మొదట్లో బావ మీద నాకు ఎలాంటి అభిప్రాయమూ లేదు. కాని అందరూ అల్లరి పెట్టటం ప్రారంభించాక నా మనసు స్పందించిన మాట మాత్రం నిజం!

ఈ అల్లరిలో పాల్గొనని వ్యక్తి అంటూ ఉంటే అది ఒక్క మాలిని మాత్రమే! అదే ఎందుకో నాకర్థం కాలేదు. మాలినిని ఒంటరిగా దొరకబుచ్చుకుని ఇదంతా ఏమిటో అడగాలి. అంతే కాదు, భరణి బావ అభిప్రాయమేమిటో కూడా తెలుసుకోవాలి-అని నిర్ణయించుకున్నాక నా మనసు కాస్త శాంతించింది.

***

మరునాడు....



తెల్లారి వెలుతురు ముఖం మీద పడగానే మెలకువ వచ్చేసింది. లేవగానే గుర్తుకొచ్చింది-ఈ రోజు భరణి బావతో ఈ విషయం అటో ఇటో తేల్చేసుకోవాలని అనుకున్న సంగతి. అతనెక్కడున్నాడోనని వెతికాను.

మామిడి చెట్టు కింద కూర్చుని పుస్తకపఠనం చేస్తున్నాడు. ఆ సమయంలో ఆ వేషమేమిటో నాకర్థం కాలేదు. కాస్త దూరంలో మాలినీ, భరణి బావ చెల్లెలు అరుణా కూర్చుని ఉన్నారు. మిగిలిన గ్యాంగంతా ఒకరు నీళ్లు తోడిపోస్తుంటే, ఇంకొకరు కుంకుడుకాయలు కొడుతున్నారు. మొత్తానికి తలంటు సన్నాహాలు జోరుగా సాగుతున్నాయి. ఎవరికి వారు తమ తమ పనుల్లో నిమగ్నమై ఉన్నారు గనుక, బావను అడగటానికి ఇదే మంచి అదననిపించింది నాకు.

మెల్లగా బావ దగ్గరికి వెళ్లి నెమ్మదిగా "బావా!" అన్నాను.

నిజంగా వినిపించలేదో లేక నటించాడో తెలీదుగాని అతను పుస్తకం లోంచి తల పైకెత్తలేదు.

"అబ్బ! నిన్నే బావా!" అంటూ ఈ సారి కాస్త గట్టిగానే పిలిచాను.

"ఏంటి నీలిమా?" అన్నాడు బావ.

ఆ స్వరం అభావంగా ఉంది. అందరూ ఉంటే "నీలిమా!" అని బావ పిలిస్తే చాలా ఆత్మీయత ఉట్టిపడుతూ ఉంటుంది మరి! నా ఆలోచనలో నేనుండగా "చెప్పు నీలూ!" అన్నాడీసారి, ప్రేమానురాగాలు రంగరించి.

బావెప్పుడూ ఒకేలా పిలుస్తాడేమో, బహుశా నేనే పొరపడి ఉంటాను లెమ్మని సర్దుకున్నాను. ఎంతైనా ఆడమనసు కదా! పాపం సర్దుబాటు లక్షణాన్ని తోడుగా తెచ్చుకునే పుడుతుంది. అతన్ని అడిగేయాలి-అని మహాజోరుగా అయితే వచ్చి కూర్చున్నాను కాని, తీరా బావ "ఏంటి నీలూ?" అని ప్రశ్నిస్తే ఏంటో చెప్పటానికి మాటలు వెతుక్కోవలసి వచ్చింది.

"అదే బావా! వాళ్లంతా నిన్నూ, నన్నూ కలిపి అలా అల్లరి చేస్తుంటే... మరీ..." అంటూ ఆగిపోయాను.

"తప్పేముంది?" అన్నాడు సూటిగా నా ముఖంలోకి చూస్తూ.


"అంటే... నేను..."

అని ఆగిపోయాను. సిగ్గు వల్ల కాబోలు. చిన్నప్పటి నుంచి తెలిసిన బావ... నన్ను ఆడించిన బావే... అయినా పెళ్లి దృష్టితో ఆలోచిస్తే ఏ అమ్మాయికైనా సిగ్గు సహజం కదా! అయినా సరే, సిగ్గుతెరలను పక్కకు నెట్టి ఎలాగైనా ఈ విషయం బావతో తేల్చుకోవాలన్నట్లు మళ్లీ ఏదో అడగబోతుంటే, భళ్లున నీళ్ల చెంబు కింద పడి పెద్ద శబ్దం అయింది.

అది విని అటు తల తిప్పాను. కింద పడిన చెంబును తీసుకోబోతున్న మాలినికేసి యథాలాపంగా చూశాను.

## టూ ఇన్ వన్!

ఇదేమీ ఎలెక్ట్రానిక్ మ్యూజిక్ సిస్టమ్ కాదు. పాప్ గాయకుడూ; 'బాండిట్ క్వీన్, దాయరా' చిత్రాల్లో నటించి నటుడూ అయిన నిర్మల్‌పాండే నిజజీవితంలో ఎత్తిన అవతారాలు. 'ఔజార్, హమ్ తుమ్ పే మర్‌తే హైఁ' చిత్రాలు కూడా నిర్మల్‌కు పేరు తెచ్చి పెట్టలేకపోయాయి. 'గాడ్ మదర్' పూర్తిగా షబానా ఆజ్మీ చిత్రమైనా, ఆమెకు దగ్గరగా వుండి నటించటం వల్ల తనకూ కాస్త గుర్తింపు వస్తుందని ఆశిస్తున్నాడు నిర్మల్. రాబోయే గోవింద రాణీముఖర్జీల 'హద్ కర్‌దీ ఆప్ నే, జీతేంగే హమ్' చిత్రాల్లో కనబడే పాత్రలు చేశాడు గనుక, వాటిమీద ఆశతో వున్నాడు నిర్మల్. లేకపోయినా పాప్ సింగింగ్ ఎలాగూ వుంది, కొత్త ఆల్బమ్‌లు విడుదల చేసుకుంటే సరిపోతుంది కదా! నిర్మల్ భార్య కౌసర్ మంచి పాటలు రాస్తుంది కనుక ఆమె ఆసరా ఎటూవుండనే వుంటుంది. క్యారీ ఆన్ నిర్మల్!



ఎన్.

ఆమె కళ్లు నా పైనా, బావ పైనా నిప్పుల వర్షం కురిపిస్తున్నాయి. ఆ చూపును నేనెప్పటికీ మరిచిపోలేను!


బావ మాత్రం చిద్విలాసంగానూ, అదో రకమైన సంతృప్తితోనూ ఓసారి మాలిని వంక చూసి, నా వైపు తిరిగి, "ఆ, చెప్పు నీలూ!" అన్నాడు అనాసక్తంగా.

వచ్చినప్పటి నుంచీ నాతో బావ చూపుతున్న అతివినయుకు అర్థం అప్పటికిగాని నాకు తెలియరాలేదు.

నిజంగా ఆడపిల్ల మనస్సు ఎంత తొందరగా ఊహల మాలికలు అల్లుకుంటుందో కదా! ఇక బావ పిలుస్తున్నా వినిపించుకోకుండా వెనక్కు తిరిగాను.

***

బాబాయి పెళ్లయిపోయింది. మా ప్రయాణం కూడా నిర్ణయించేశారు.



మరునాడు బయలుదేరాలని తెలిసినప్పటి నుంచీ అందరి ముఖాలూ దిగులుతో నిండిపోయాయి. ఒకరితో ఒకరికి మాటామంతీ లేవు. అసలు కదిపితే ఏడ్చేస్తారేమో అన్నట్లుగా ఉన్నారంతా.

మరునటి రోజు...

మాలినీవాళ్లు రేణిగుంటలో దిగారు. రైలు కదలటానికి ఇంకా సమయం ఉండటంతో, నేనూ, మాలినీ తప్ప అందరూ రైలు దిగారు.

ఆ సమయం కోసమే ఎదురుచూస్తున్న దానిలా మాలిని నా దగ్గరకు వచ్చి, "నీలూ! ఓ మాట చెప్తాను, ఏమనుకోకూడదు" అంది, ముందు కాళ్ల బంధాలు వేస్తున్నట్లు.

అప్పటికే నా కళ్లు నీరు నిండిన మేఘాలై వర్షించటానికి సిద్ధంగా ఉన్నాయి.

"చూశావా? అదిగో, నువ్విప్పుడే ఏడ్చేస్తున్నావు. అందుకే నేను చెప్పాలంటే తటపటాయిస్తున్నాను" అంది మాలిని. పిచ్చిమొహంది, దాని కళ్లు కూడా వర్షించే మేఘాలవుతున్నాయి.

"ఛ.. ఛ! నీవు చెప్పబోయేదేదో ఊహించి ఏడవటం లేదు. మనం ఇక విడిపోవాలి కదా అని ఏడుస్తున్నాను" అన్నాను.

ఏమనుకుందో ఏమో, అయిదు నిముషాలపాటు మౌనంగా ఉండిపోయింది. ఆ తర్వాత అతినెమ్మదిగా అక్షరం అక్షరం కూడబలుక్కుంటున్నట్లుగా "భరణి బావ, నిన్ను తన మీద ఎటువంటి ఆశలూ పెట్టుకోవద్దని చెప్పమన్నారు" అంది.

ఒక్క క్షణం గాలి స్తంభించినట్టయింది.

మాలిని తిరిగి చెప్పసాగింది-" 'మొదట్లో నీలిమ మీద అభిమానం ఉండేది. కాని ఆడపిల్ల అంటే నీలా నెమ్మదిగా, పొందికగా, గంభీరంగా ఉండాలి. తక్కువ మాట్లాడాలి. నెమ్మదిగా నవ్వాలి తప్ప నీలిమలా చాటర్ బాక్స్‌లా మాట్లాడటం, జోకర్‌లా నవ్వుతూ, నవ్విస్తూ ఉండటం కాదు. అలాంటి ఆడపిల్లను స్నేహితురాలుగా తప్ప భార్యగా ఏ అబ్బాయీ ఇష్టపడడు. అందుకే నీలిమ మీద నాకు వుండేది కేవలం అభిమానమే!' అని చెప్పమన్నారు..."

నేను అలా మాలినినే చూస్తుండిపోయాను.

మాలినిని బావ చేసుకుంటే నాకేం బాధ లేదు. ఎందుకంటే మాలిని నా ఇష్టసఖి కాదా? కాని... ఇలా ఓ ఆడపిల్ల మనసుతో ఆడుకోవటం సంస్కారమనిపించుకుంటుందా? మాలినిని మంచమ్మాయిగా చూపటం కోసం నన్ను పొగరుబోతుగా చిత్రించటం ఏమంత న్యాయమూ, సభ్యతా? అంటే ఆడపిల్ల తన కుటుంబసభ్యుల దగ్గర కూడా సిగ్గునూ, గాంభీర్యాన్నీ నటించాలా? కాస్త ఫ్రీగా ఉన్నందుకు బావ ఇలా నా ప్రవర్తనకు భాష్యం చెపుతాడా? సొంత బావ కదా, తనే చెప్పొచ్చుగా! ఈ మాలిని సాయం కావాలా- ఇంటిమనిషినైన నాతో తన మనసులోని మాట చెప్పటానికి? అసలీమె ఎందుకు ఇది చెప్పటానికైనా?-అన్నీ జవాబు లేని ప్రశ్నలే!

***

"నీలూ!" అని బావ గట్టిగా పిలవటంతో ఈ లోకంలోకి వచ్చాను.

బావకూ, మాలినికీ మధ్య అభిప్రాయభేదాలున్నాయనీ, వారి మధ్య అంత సయోధ్య లేదనీ తెలిసినవారి ద్వారా విన్నా కాని, నమ్మాలనిపించలేదు. ఇప్పుడు బావ "నీ విషయంలో నేను తప్పు చేశాను" అనటంతో ఎన్నో రోజులు నాకు మనశ్శాంతి లేకుండా చేసిన సంఘటనలన్నీ గుర్తుకొచ్చాయి.

"నీలూ! నేను చాలా పొరపాటు చేశాను. మనసు నిండా నింపుకొని ఆరాధించింది నిన్నే కాని, నీ ప్రవర్తన చూసి ఈ పిల్ల భర్త చెప్పినట్లు నడుచుకునే అమ్మాయి కాదనీ, నన్ను డామినేట్ చేస్తుందనీ అనుకున్నాను. నన్ను క్షమించు! పైగా మా నాన్నగారు కూడా మనిద్దరి జాతకాలూ పరిశీలించి, 'నీలిమది రాక్షసగణం, నీది దేవగణం. కనుక మీకిద్దరికీ కుదరదు'అన్నారు. మాలినితో పెళ్లయిన తరువాత కాని నేనేం కోల్పోయానో అర్థం కాలేదు" అంటూ ఏడుపును నిగ్రహించుకునేందుకు ప్రయత్నించాడు.

ఎందుకో నవ్వొచ్చింది. 'నువ్వలా అన్నావు కనుకనే నాకు బంగారుకొండ లాంటి సంస్కారవంతుడైన భర్త లభించాడు' అనుకున్నాను మనసులోనే.

అయినా ఎవరికెవరిని రాసి పెడతాడో ఆ భగవంతుడు, మనకు తెలీదు కదా! 'మ్యారేజెస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్' అని ఊరికే అనలేదు. బావ నన్ను కాదన్నందుకు నాకేం బాధ లేదు. కానీ సరదాగా, నవ్వుతూ, తుళ్లుతూ ఉండే అమ్మాయిలు సరిగ్గా సంసారాలు చేసుకోలేరేమో అనే ఒకప్పటి తన అభిప్రాయం తప్పని బావ తెలుసుకున్నందువల్లనేమో, ఏ మూలో గాయపడిన నా మనసుకు శాంతి చేకూరినట్లనిపించింది. ■


# మాదీఫల రసాయనము

(పైత్యవికారములకు)



వైద్యరత్న పండిత
డి. గోపాలాచార్యులు

పైత్యాధికము వలన కలుగు అన్ని వ్యాధులకు ఇది అత్యుత్తమమైన రసాయనము. నోటిలో నీరూరుట, తల తిరుగుట, కండ్లు తిరుగుట, వాంతివచ్చునట్లుండుట, గుండెలో మంట, ఈ మొదలైన జబ్బులను సునాయాసముగా పోగొట్టును. కామిల రోగమును పోగొట్టుటకు ఈ మందు పెట్టినది పేరు. నాలుకకు రుచిని కలిగించి దేహమునందలి పిత్తమును సరిపరచి మనస్సుకు స్థిమితము చేకూర్చి పైత్యాధిక్యముచే కలుగుయే ఇతర వ్యాధిని దరిజేరనీయక వజ్రకవచమువలె రక్షణమొసగ గలది. మా మాదీఫల రసాయనమని చెప్పుటకు గర్వించుచున్నాము. అన్ని కాలములయందు అందరును ఉపయోగించ తగినది.

వైద్యరత్న పండిత డి. గోపాలాచార్యుల వారి

**ఆయుర్వేదాశ్రమమ్ ప్రైవేట్ లిమిటెడ్**

70, జి.యన్.చెట్టిరోడ్డ్, టి.నగర్, చెన్నై - 600 017, ఫోన్: 8281381, 8214193